క్లుప్తంగా

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నందిగామరూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సీఐ వైవీఎల్ నాయుడు అన్నారు. మండలంలోని చందాపురం గ్రామ సమీపంలోని తపస్య విద్యా సంస్థల ద్వితీయ వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీవైఈవో సాంబశివరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, పాఠశాల ప్రతినిధులు శాఖమూరు అమరకృష్ణ ప్రసాద్, రజని, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటిపై దాడి చేసి ఫర్నిచర్ ధ్వంసం చేశారని ఫిర్యాదు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భర్త ఇంట్లో లేని సమయంలో కొంతమంది వ్యక్తులు వచ్చి ఇంట్లోని ఫర్నిచర్ ధ్వంసం చేశారని ఒక మహిళ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కట్టా సత్తెయ్య, శివ నాగమణి దంపతులు భవానీపురంలోని ఏకలవ్యనగర్‌లో నివసిస్తున్నారు. బాధితురాలి కథనం ప్రకారం శనివారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో మేడా గోపి, కుంభా రాజేష్ అలియాస్ ఏసు, గరిక వీరేంద్ర, గరిక ప్రసాద్, బాలసాని అమ్ము, బాలసాని చంటి, గరిక రమణ, బాలసాని లక్ష్మి, మేడా దశరథ మరి కొంతమంది తమ ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి ఆఫీస్ రూంలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి రాడ్డులతో ఇల్లంతా కలయ తిరుగుతూ 'కట్టా సత్తిగాడు ఏడి, మేము వాడిని చంపకుండా వెళ్లమని భయభ్రాంతులకు గురి చేశారు. ఆ సమయంలో శివ నాగమణి మరిదికి ఆరోగ్యం బాగోకపోవడంతో ఆమె భర్త కట్టా సత్తెయ్య హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. గొడవ గురించి ఆమె వెంటనే భర్తకు ఫోన్ చేయగా ఆయన 112 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పారు. పోలీసులు వచ్చి వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా పారిపోయారు. కుంభా రాజేష్ వలన తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని, అతని నుంచి ప్రాణ రక్షణ కల్పించాలని శివ నాగమణి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించారు. లోక సంరక్షణార్థం, సర్వ మానవాళికి పరిపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ప్రతి ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరుగుతుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్య భగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవను నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు సేవలో పాల్గొన్నారు. అనంతరం ప్రసాదాల వితరణ చేసి, ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గంలో అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

ఆటో ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): అతి వేగంతో వచ్చిన ఆటో ఢీకొనటంతో యువకుడు గాయాలపాలైన ఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భవానీపురం గాంధీ బొమ్మ రోడ్‌లో నివసిస్తున్న ఆర్ముగం గణేష్ స్థానిక బ్యాంక్ సెంటర్‌లో టీ స్టాల్ నడుపుతున్నాడు. ప్రతి రోజూ ఉదయం ఇంటి వద్ద నుంచి టీ స్టాల్‌కు వచ్చి సాయంత్రం ఇంటికి వెళతాడు. ఈ క్రమంలో గత నెల 28వ తేదీ ఉదయం టీ స్టాల్ వద్దకు వెళ్లాడు. సుమారు 8 గంటల సమయంలో తండ్రి ఆర్ముగం పెరుమాళ్ రెడ్డి షాపు వద్దకు రాగా ఇంటికెళ్లి టిఫిన్ చేసి వస్తానని చెప్పి బయలుదేరి జాతీయ రహదారి దాటుతుండగా స్వాతి థియేటర్ సెంటర్ వైపు నుంచి కుమ్మరిపాలెం సెంటర్ వైపు వెళుతున్న ఆటో గణేషను ఢీ కొట్టింది. అతను వెంటనే కిందపడిపోయాడు. సమీపంలోనే ఉన్న తండ్రి వచ్చి కుమారుడిని స్థానిక ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకువెళ్లాడు. ఎడమ కాలు కింద భాగాన ఎముక విరిగింది. కుడి కాలు తుంటి వద్ద ఎముక విరగ్గా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలిసిన భవానీపురం పోలీసులు ఆదివారం హాస్పిటల్‌కు వచ్చి బాధితుడి స్టేట్‌మెంట్ రికార్డ్ చేసుకుని కేసు నమోదు చేశారు.

100 పడకల ఆస్పత్రి నిర్మాణం జరిగేనా?

- నాలుగంతస్తుల భవనంలో సరిపోతుందా?
- పార్కింగ్, తదితర వసతుల పరిస్థితేంటి?
- ప్రభుత్వ నిర్ణయంపై పెదవి విరుస్తున్న ప్రజలు



100 పడకల ఆస్పత్రి నిర్మించేందుకు గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన స్థలం

> 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి సుమారు ఐదెకరాల స్థలమైనా ఉండాలని వైద్య విధాన పరిషత్ అధికారులు చెబుతున్నా కూటమి ప్రభుత్వం ఇప్పుడున్న ఆస్పత్రి స్థలంలోనే అభివృద్ధి చేస్తామంటుండటంపై నందిగామ పట్టణ ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సైతం ఆస్పత్రి స్థలం 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి అనువుగా లేదని చెప్పటం గమనార్హం. ఇవేమీ పట్టించుకోకుండా ఆ స్థలంలోనే వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామని చెబుతుండటంతో కూటమి ప్రభుత్వం మిగతా హామీల్లాగానే ఈ హామీ కూడా ఉత్తుత్తిదే అవుతుందా అని పట్టణ ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

నందిగామరూరల్: నందిగామ పట్టణంలో ప్రస్తుతమున్న 50 పడకల ఆస్పత్రినే 100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయటంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. 2.4 ఎకరాలలో ఉన్న ఆస్పత్రిలో 50 పడకల ఆస్పత్రి నిర్వహణకే అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పుడున్న ఆస్పత్రి పట్టణంలో అత్యంత రద్దీ కలిగిన ప్రాంతంలో ఉంది. ఆస్పత్రి భవనాలు కాకుండా మిగిలిన కొద్దిపాటి ఖాళీ స్థలంలోనే వైద్యులు, సిబ్బంది, ఆస్పత్రికి వచ్చే రోగుల వాహనాలను నిలుపుదల చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఇప్పుడున్న ఆస్పత్రినే వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఇదెలా సాధ్యమంటూ పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఆస్పత్రి నిర్మాణానికి ఐదెకరాల స్థల సేకరణ

పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆస్పత్రి నిర్మాణానికి ఐదెకరాల స్థలాన్ని సేకరించేందుకు అనుమతులు జారీ చేసింది. పట్టణంలో ఎకరం ధర కోట్లల్లో ఉన్నప్పటికీ అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ రైతులతో మాట్లాడి ఎకరం రూ.50 లక్షల చొప్పున ఆస్పత్రి నిర్మాణానికి అందించేలా ఒప్పించారు. స్థలానికి సంబంధించిన రూ.2.5 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు కూడా ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులతో పాటు గజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆస్పత్రి స్థలానికి వచ్చేందుకు దారి నిమిత్తం చిరుమామిళ్ల చైతన్యకుమార్, మారం అమరయ్యలతో మాట్లాడగా వారు 18 సెంట్ల స్థలాన్ని సైతం పెద్ద మనసుతో ఉచితంగా అందించారు. దీంతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి జిల్లా అధికారులతో కలిసి గత ప్రభుత్వంలో శంకుస్థాపన చేసినప్పటికీ ఎన్నికలు సమీపించటంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

సేకరించిన స్థలంలో నిర్మించటం వల్ల ప్రయోజనాలు...

- గత ప్రభుత్వ హయాంలో ఆస్పత్రి నిర్మాణానికి సేకరించిన స్థలం జాతీయ రహదారి పక్కనే ఉండటంతో ట్రాఫిక్ తదితర సమస్యలు లేకుండా క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి చేర్చవచ్చు.
- సరిపడ స్థలంలో ఆస్పత్రి ఉండటం వల్ల భవిష్యత్తులో వైద్య కళాశాలగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.
- జాతీయ రహదారికి సమీపంలో 100 పడకల ఆస్పత్రి ఉండటం వల్ల ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అంతే కాకుండా ఆయా గ్రామాల నుంచి వచ్చే వారికి, జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారులకు అనువుగా ఉంటుంది.
- సేకరించిన స్థలంలో నిర్మించటం వల్ల పట్టణంలోని 17, 18 వార్డులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతాయి. ఆయా వార్డుల్లోని భూములు, స్థలం విలువలు పెరగటం వల్ల ఆ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు సైతం మెరుగుపడతాయి.

ఇప్పుడున్న ఆస్పత్రిలో 100 పడకల వల్ల ఇబ్బందులు

- ప్రస్తుతమున్న ఆస్పత్రి కేవలం 2.4 ఎకరాల విస్తీర్ణంలో అత్యంత రద్దీ కలిగిన ప్రాంతంలో ఉంది.
- ఆస్పత్రికి చేరుకునేందుకు ఉన్న ప్రధాన రహదారులన్నీ ఇరుకుగా ఉండటంతో పాటు వాహనాలు, ఆయా పనులపై నందిగామకు వచ్చే ప్రజలతో నిత్యం రద్దీగా ఉంటాయి. రద్దీ కలిగిన ప్రాంతంలోని ఆస్పత్రికి అత్యవసర, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని సకాలంలో తీసుకురావటం ప్రయాసతో కూడిన పని.
- 100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయటం వల్ల అన్ని విభాగాల వైద్యులు అందుబాటులో ఉంటారు. రోగుల సంఖ్య కూడా పెరుగుతుంది. అందుకు సరిపడ స్థలం లేకపోవటంతో ఆస్పత్రికి వచ్చే రోగులు వాహనాల పార్కింగ్, తదితర వసతులకు ఇబ్బంది పడాల్సి వస్తుంది.
- వాహనాల శబ్ద కాలుష్యం, పర్యావరణ కాలుష్యంలోనే రోగులు చికిత్స పొందాల్సి వస్తుంది.
- రోగులకు అవసరమైన ఆహ్లాదకర వాతావరణాన్ని అందించలేము.
- నాలుగు అంతస్తులు నిర్మించటం వల్ల అగ్నిప్రమాదాలు, విపత్తులు జరిగిన సమయంలో ఇబ్బందికర పరిస్థితులుంటాయి.



ప్రస్తుత ఆస్పత్రి భవనం ఉన్న స్థలం

హైవే బ్రిడ్జికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు

జగ్గయ్యపేట అర్బన్: నాణ్యతా లోపంతో మరమ్మతులు చేయడం వలన ప్రారంభమైన కొద్దిరోజులకే మరలా హైవే బ్రిడ్జి మూతపడిందని, అధికారులు వెంటనే స్పందించి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక పాలేటిపై గరికపాడు వద్ద 65 వ నంబర్ జాతీయ రహదారిపై నిర్మించిన హైవే బ్రిడ్జిని ఆదివారం స్థానిక పార్టీ నాయకులతో కలిసి తన్నీరు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ–ఆంధ్ర మధ్య ఉన్న పాలేటి బ్రిడ్జి ఆగస్టు నెలలో వచ్చిన వరదల కారణంగా బ్రిడ్జి ఒకవైపు దెబ్బతిన్నదన్నారు. దీంతో ఎన్నో నెలలుగా పనులు చేపట్టి మరమ్మతులు చేపట్టి జనవరి నెలలో పనులు పూర్తయి ప్రారంభించారని, వారంలోపులోనే బ్రిడ్జి కుంగిపోవడంతో మరలా మరమ్మతులు చేపట్టారన్నారు. నెలలు గడుస్తున్నప్పటికీ మరమ్మతు పనులు నత్తనడకన జరుగుతున్నాయన్నారు. హైవే అథారిటీ వారు టోల్‌గేట్ వద్ద టోల్ రూపంలో వాహనదారుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారే తప్ప, బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయడంలో మాత్రం వెనుకబడిఉన్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి బ్రిడ్జి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. లేనిపక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మాతంగి నాగబాబు, పార్టీ పేట పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు కన్నమాల శామ్యూల్, పేట పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.



గరికపాడు వద్ద హైవే బ్రిడ్జిని పరిశీలిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

మిర్చికి రూ.20 వేల మద్దతు ధర ప్రకటించాలి

రైతులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మిర్చి రైతులకు ఎకరాకు రూ.20 వేలు మద్దతు ధర ప్రకటించి కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గ్రామంలోని మిర్చి కల్లాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది మిర్చి రైతులకు తీవ్ర నష్టాలు వాటిల్లాయన్నారు. నల్లి పురుగు తదితర చీడపీడల వల్ల పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మిర్చి రైతులను ఆదుకోవాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోరాడుతున్నారని చెప్పారు. తూతూమంత్రంగానే మద్దతు ధర ప్రకటించేందుకు ప్రభుత్వం యత్నిస్తోందని మండిపడ్డారు. మిర్చి రైతుకు క్వింటాకు రూ.20 వేలు ఇస్తే కొంత ఉపశమనం కలుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో అరకొరగానే నిధులు కేటాయించి చేతులు దులుపుకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పర్యటిస్తుంటే... రైతుల కన్నీటి వ్యథలు తమను కలచివేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ కన్వీనర్ దొంగల సింహాద్రి, రైతు విభాగం నాయకుడు ఏలూరి శివాజీ, నాయకులు మండవ శ్రీనివాస్ గౌడ్, మాతంగి నాగబాబు, బద్యా నాయక్, కన్నమాల శామ్యూల్, పొన్నం నరసింహారావు, కొత్తపల్లి పెంటయ్య, రైతులు పాల్గొన్నారు.



చిల్లకల్లులోని మిర్చి కల్లాలను పరిశీలిస్తున్న తన్నీరు, నాయకులు

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

తిరువూరు: తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరుణాచలానికి తిరువూరు నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు ఈ నెల 12న ఏర్పాటు చేశామని తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజరు సుబ్రహ్మణ్యం తెలిపారు. 12న సాయంత్రం ఐదు గంటలకు తిరువూరు నుంచి బయలుదేరి 13న శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం రాత్రికి అరుణాచలం చేరుతుందన్నారు. 14న ఉదయం తిరిగి బయలుదేరి కంచి తిరుత్తణి, శ్రీకాళహస్తి దేవాలయాల దర్శనం అనంతరం 15వ తేదీ రాత్రికి తిరువూరు చేరుతుందని చెప్పారు. తిరువూరు నుంచి రానుపోను ఒక్కొక్కరికి రూ.2,800 టికెట్ ధర నిర్ణయించామన్నారు. ఆన్‌లైన్‌లో అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్ టికెట్లు పొందవచ్చని చెప్పారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేటఅర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇటీవల పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పెనుగంచిప్రోలు మండలం శివాపురం గ్రామానికి చెందిన ఏలూరు శివాజీ ఆదివారం తొలిసారిగా పట్టణంలోని పార్టీ కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం మిర్చి రైతులను పట్టించుకోకుండా గాలికి వదిలివేసిందన్నారు. మిర్చి రైతులకు న్యాయం చేయాలని వారి పక్షాన వైఎస్సార్ సీపీ గత కొన్ని రోజులుగా పోరాటం చేస్తోందన్నారు. నియోజకవర్గంలోని రైతులందరినీ కలుపుకొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అలాగే జిల్లాలో రైతుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని శివాజీకి సూచించారు.

అనిగండ్లపాడు గ్రామ పార్టీ అధ్యక్షునికి సన్మానం

పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు యానాల సురేష్‌ను వైఎస్సార్ సీపీ నేతలు అభినందించారు. ఆయన మొట్టమొదటి సారిగా పార్టీ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా జగ్గయ్యపేటలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఏలూరు శివాజీ, పార్టీ మండల అధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు, పార్టీ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు, జిల్లా కార్యదర్శులు, సర్పంచ్‌లు, శివాపురం, అనిగండ్లపాడు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఏలూరు శివాజీని సన్మానిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు



బోనాలతో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావటంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

'అ'పూర్వ' సమ్మేళనం



అపూర్వ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో 1999–2000వ విద్యా సంవత్సరంలో పదో తరగతి కలిసి చదువుకున్న వారంతా ఆదివారం కలుసుకున్నారు. పాతికేళ్ల నాటి బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కుశల ప్రశ్నలు వేసుకున్నారు. క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. నాడు పాఠాలు బోధించిన గురువులను సన్మానించుకున్నారు.

–పెనుగంచిప్రోలు

200 పని దినాలు కల్పించాలి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు



పోరాటనగర్‌లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

మైలవరం: ఉపాధి హామీ కూలీలకు 200 పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ. 700 కూలీ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మైలవరం మండలం పోరాట నగర్‌లో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించి ఉపాధి హామీ పనులను పరిశీలించి, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ నిధుల కేటాయింపులో కోత పెట్టడం, కేటాయిస్తున్న అర కొర నిధులను దారి మళ్లించి సంబంధం లేని పనులకు వినియోగించడం వంటి చర్యలు గమనిస్తుంటే ఉపాధి హామీ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాతరేస్తున్నట్లుగా ఉందని విమర్శించారు. గత పదేళ్లుగా పథకానికి క్రమేణా నిధులు తగ్గిస్తూ, కేటాయించిన అరకొర నిధులు కూడా సీసీ రోడ్లు, వ్యవసాయానికి అనుసంధానం పేరుతో యంత్రాలతో పనిచేయిస్తూ కూలీలకు పనిలేకుండా చేయడంతో గ్రామీణ నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పని చేయగలిగిన వారికి జాబ్ కార్డులు ఇవ్వకుండా, ఉన్న జాబ్ కార్డులు కూడా తగ్గించడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య నాయకులు బాణోతు పెదబాలు నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆంగోతు చిన్నా నాయక్, భూక్యా మోటో, కారుమూరి రత్నకుమారి, బసవాని కుమారి, పి. దాసు తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో నడుచుకోవాలి

వీరులపాడు: రౌడీషీటర్‌లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని ఎస్ఐ అనిల్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో నేరచరిత్ర కలిగిన వారికి ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రౌడీషీటర్‌లపై నిత్యం నిఘా ఏర్పాటు చేశామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ముఖ్యంగా రౌడీ షీటర్‌లు సత్ప్రవర్తనతో నడుచుకునే వారిని గుర్తించి షీట్ ఎత్తివేతకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

జగ్గయ్యపేట అర్బన్: ఈనెల 4 వ తేదీన పట్టణంలోని విజయవాడ రోడ్‌లో వైఎస్సార్ సర్కిల్ వద్ద ఉన్న సీఎస్ఐ మిషన్ హాస్పిటల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని సీఎస్ఐ డయోసిస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పాకలపాటి కనకరావు ఆదివారం తెలిపారు. హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కృష్ణా–గోదావరి అధ్యక్ష ఖండం పీఠాధిపతి(బిషప్) డాక్టర్ టి.జార్జ్ కొర్నేలియస్, కృష్ణా–గోదావరి డయోసిస్ ఉమెన్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ జాషువా కుమారి, స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి స్వల్ప గాయాలు

వీరులపాడు: కారు స్కూటీని ఢీకొన్న ఘటనలో ఇరువురు వ్యక్తులకు గాయాలైన సంఘటన వీరులపాడు మండలం జగన్నాధపురం గ్రామ శివారులో ఆదివారం రాత్రి ఏడు గంటలకు జరిగింది. సేకరించిన సమాచారం మేరకు తెలంగాణ రాష్ట్రం మధిర నుంచి వస్తున్న కారు కంచికచర్ల నుంచి జుజ్జూరు వైపు వస్తున్న స్కూటీని ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇరువురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న స్థానికులు గాయపడిన వ్యక్తులను 108 వాహనంలో నందిగామ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

మృతుని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ 5వ స్టేజ్ వాటర్ ప్లాంట్ ట్యాంక్‌లో ఊపిరాడక మృతి చెందిన పెయింటింగ్ వర్కర్ బుర్ర ప్రసాద్ కుటుంబానికి వర్క్‌మేన్ కాంపన్సేషన్ చట్టం పరిధిలో రూ.25 లక్షల నష్టపరిహారం వారి కుటుంబానికి చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎం. మహేష్ ఎన్టీటీపీఎస్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వరుస ప్రమాదాలతో కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా నివారణ చర్యలు తీసుకోవడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కొన్ని నెలల క్రితమే కోల్డ్ ప్లాంట్ బాయిలర్ బ్లాస్ట్ అయ్యి ఉద్యోగులు, కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయని గుర్తు చేశారు. భద్రత ప్రమాణాలు పాటించకపోవడంతోనే ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్టీటీపీఎస్ ప్రమాదాలపై ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ సమగ్ర విచారణ చేపట్టి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

8న మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సెంటినీ హాస్పిటల్స్ సహకారంతో రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పోలవరపు విజయభాస్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో థైరాయిడ్, ఎముకలు, కీళ్ల వ్యాధులు, మధుమేహం వంటి నిర్ధారణ పరీక్షలను వైద్యులు నిర్వహిస్తారన్నారు. మహిళల ఆరోగ్యం – కుటుంబానికి ఆధారం అనే నినాదంతో అవగాహన సదస్సు చేపట్టామని చెప్పారు. అశోక్‌నగర్‌లోని సోమనాథ్ హాస్పిటల్‌లో నిర్వహించే ఈ శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో వైద్య పరీక్షలకు 98498 72499 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడకల్చరల్: స్వరలయ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం మల్లెలు పూసే వెన్నలకాసే పేరుతో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. హైదరాబాద్, నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు చిత్ర గీతాలను మధురంగా ఆలపించారు. సీనియర్ గాయకుడు వైఎస్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్.లలిత, వీణ, గంటిశైలజ, మల్లేశ్వరి, స్వరకల్యాణి, రాధాకారాణి, భారతి, శివరామకృష్ణ, రవీంద్రనాథ్ ఆచార్య, కృష్ణమోహన్, అవినాష్‌లు చిత్రగీతాలను ఆలపించారు.

నేడు పరిష్కార వేదిక రద్దు

కంచికచర్ల: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు చేస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ వేమూరి మానస ఆదివారం తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉందని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరిష్కార వేదిక రద్దు చేస్తున్నట్లు మానస తెలిపారు.